# స మి ధ

‘అమ్మా’ బంగారమ్మ బీరకాయలు తెచ్చింది. వంట ఇంట్లో ఉన్న శారదమ్మకు వినిపించేలా అరిచింది అరుణ.

బంగారమ్మ కూరలు తెచ్చిందంటె కాసేపు కూర్చొని కొడుకు కబుర్లు చెప్పికాని వెళ్ళదు. స్టౌమీద ఎసరు పడేసి వీథిలోకి వచ్చింది శారదమ్మ. బీరకాయలు తెచ్చి పోసేస్తున్నావ్? మరే కూరలు లేవా! అంటూ.

వంగమొక్కలు పూతపట్టేయమ్మా! కాకరపాదు కూడా పందిరకు అల్లుకుంటూంది. బెండమొక్కలు లేచాయి ఇంకెన్నాళ్ళో ఉండవమ్మా బీరకాయలు అయిపోతయి అంటూ కొన్ని బీరకాయలు ఎంచి కిందపెట్టి తియ్యండి ఎల్లిపోవాల అంది బంగారమ్మ.

గంగులు వస్తున్నాడేమిటి? నవ్వుతూ ప్రశ్నించింది శారదమ్మ. పొండమ్మ ఏలాకోలవాడతారు. ఆడి జిమ్మడ, ఆడింక నాకోసం నా కొడుకోసం వత్తాడా! అని ముసి ముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది బంగారమ్మ.

అమ్మా! బంగారమ్మ ఎందుకు తొందరగా వెళ్ళిపో యిందో తెలుసా! అంది అరుణ.

ఎందుకే! కుతూహలంగా అడిగింది శారదమ్మ.

చంద్రిగాడు సమ్మెచేస్తున్నాడు కదమ్మా!

అయితే!

వాడు ఇవాళ విశాఖపట్నం వెళ్ళిపోతానంటున్నాడట.

'ప్చ్. పాపం వాడు బొత్తిగా పెంకెఘటం. తల్లిమాట వినడు' నిట్టూర్చింది శారదమ్మ.

సుమారుగా శారదమ్మా బంగారమ్మా ఓ వయసు వాళ్ళు. శారదమ్మ ఈ ఊరి కామందు భార్య. బంగారమ్మ శారదమ్మగారి పాలేరుకూతురు. బంగారమ్మ చాలా చక్కనిది ఆమెకు ఊహ తెలియని పసితనంలోనే పెళ్ళి జరిపించాడు ఆమె తండ్రి గంగులికిచ్చి. నల్లగా ఒడ్డూ, పొడుగూతో వస్తాదులా ఉంటాడు గంగులు. వయసొచ్చి ఊహ తెలిసిన బంగారమ్మ గంగులుకే మనసిచ్చింది. గంగులుతో సంవత్సరం కాపురం చేసిందేమో బంగారమ్మ చంద్రిగాడికి తల్లయింది. చంద్రిగాడు పుట్టిన మూడవరోజు గంగులు ఊరువదలి పరారయిపోయాడు. అతనితోపాటు ఆ ఊర్లోని రెల్లి పైడమ్మ కూడా కనుపించలేదు. ఇద్దరూ కలసి లేచి పారిపోయారన్నారు ఆ అగ్రహారపు జనం. గంగులు తిరిగి వస్తే కులంలో కలుపుకోకూడదన్నారు కులపెద్దలు. బంగా రమ్మని మారుమను వివ్వాలన్నారు. ఆరు నెలలు గడప

దాటి బయటికి రాలేదు బంగారమ్మ. తర్వాత ఓ రోజు సాయంత్రం శారదమ్మగారింటికి కొడుకునెత్తుకు వచ్చింది. గంగులు నన్నిలా అన్యాయం చేస్తాడని అనుకోలేదమ్మా! అని ఏడ్చింది.

పోనీలే! మరో మనువుకి వెళ్ళిపో మీ కులంవాళ్ళంతా అంటున్నారు కదా! మీ అయ్యా అదే అంటున్నాడు. చంద్రిగాణ్ణి తన దగ్గర ఉంచుకుంటాడట అంది శారదమ్మ.

ఛీ.... పోన్లెండమ్మ ఎదవశరీరం ఎందరిచేతుల్లో పడతాది. నా మనసు ఆడికే ఇచ్చాను. మనువు ఆడికే ఎళ్ళాను ఆడి మోజు తీరిపోయింది ఎళ్ళిపోయాడు. ఆడిపేరు మోసుకుని ఈణ్ణి పెంచుకుంతాను. నా బాబుని కలెక్టెరుని సేత్తాను. ఈడే లేకుంటే గంగులు నన్నొగ్గేసి ఎల్లిపోయినందుకు బతికే దాన్నేనిటమ్మ! ఏ ఇసవ్ మింగి పేనం తీసుకునేదాన్ని.

మళ్ళీ గంగులు తిరిగివస్తే వాడిదగ్గర కెళ్ళిపోతావేమిటి! ఆసక్తిగా అడిగింది శారదమ్మ ఆమెమాట మధ్యలో.

వెళ్ళిపోతాను అన్నట్లు తలగుండ్రగా ఊపింది బంగారమ్మ.

"నీ కులంవాళ్ళు .... ఆ పైడమ్మ?" తెల్లబోయి ఆమెవైపు చూస్తూ ప్రశ్నించింది శారదమ్మ.

'కులం ఒగ్గేసుకుంటాను కాని మను వొగ్గేసుకుంటానా! ఆడికేటి మొగోడు ఎందరన్నా ఉంటారు.'

"అయితే నీకు గంగులుమీద కోపంలేదూ!"

"నన్నెందుకు ఒగ్గేసిపోవాలా? అదే నా కోపం" ఇది ఆనాటి సంభాషణ. గంగుణ్ని గాఢంగా ప్రేమించింది బంగారమ్మ. తర్వాత రెండేళ్ళకు పైడమ్మ తిరిగి అగ్రహారం వచ్చింది. తనని ఒదిలేసి మిల్ట్రిలోకి పోయాడు అని చెప్పింది. ఎప్పటికైనా తనకోసం తనకొడుకు కోసం తిరిగి వస్తాడని బంగారమ్మ నమ్మకం. ఆనాడు పురిటికందు చంద్రిగాణ్ణి చేతుల్లోకి తీసుకొని 'బంగారీ ఈణ్ణి బాగా సదివించి ఉద్యోగ త్తుణ్ణి సెయ్యాలె' అని గంగులన్నమాటలు ఇప్పటికీ బంగా రమ్మ చెవుల్లో గింగురుమంటూ ఉంటాయి.

ఎవరు ఎన్ని రకాలుగా నచ్చజెప్పిచూచినా మారు మనువుకి ఒప్పుకోలేదు బంగారమ్మ. పండించుకు బ్రతకమని తండ్రి రెండు మడిచెక్కలూ, ఒకది గడ్డిఇల్లూ ఇచ్చాడు. ధాన్యం తిండికి పండించుకొని, కూరగాయలు పండించి అగ్ర హారపు బుగతలందరిళ్ళదగ్గరా రచ్చబండదగ్గరా అమ్ముతుంది బంగారమ్మ. ఏడేళ్ళు రాగానే చంద్రిగాణ్ణి బళ్ళోకి పంపిం చింది పలకాబలపం కొని. వాడు ఎనిమిదవ తరగతికి రాగానే మళ్ళీ కులంవాళ్లు 'సదివించి వాణ్ణెందుకు పనికిరానివాణ్ణిసే త్తవు? ఎగసాయంలో పెట్టు' అని హితవు చెప్పారు. గంగులు ఈణ్ణి సదివించమన్నాడు అని బంగారమ్మంటె అందరూ విరగబడి నవ్వేవారు. ఆడు దీన్ని మరిసిపోయినా ఇది ఆణ్ణి మరిసిపోదు అని.

కూలీ నాలీ చేసి కూరలమ్మి కొడుకు చదువు కోసం డబ్బులు కూడేసేది బంగారమ్మ. స్కూలుఫైనలు ప్యాసయిన

కొడుకుని బంగారమ్మ పట్నం కాలేజీ చదువుకి పంపిస్తూంటే అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. సెబాసయిన ఆడది అనుకున్నారు.

కొడుకు కాలేజీలో చదువుతున్నాడన్న తృప్తి, గర్వం బంగారమ్మ ప్రతికదలికలోనూ తొణికిసలాడుతూంటాయి. గంగులు ఓసారి వచ్చి తననూ తన కొడుకునూ చూస్తే బాగుండునని ఆమె అనుకోని రోజు లేదు.

చంద్రిగాడు బి. ఎస్‌సి. ఫైనలియరు చదువుతున్నాడు. కొడుకు సెలవులకు ఇంటికివస్తే రోజుకో పిండివంట చేసి పెడుతుంది బంగారమ్మ. మిలట్రీవాళ్ళు ఎక్కడెక్కడ ఉంటారో, ఏమిటి చేస్తూంటారో, ఎలాటి బట్టలు వేసుకుంటారో, కొడుకుని ప్రశ్నించి అతను చెప్పిన జవాబులు ఆసక్తిగా వింటుంది.

తల్లితండ్రుల దగ్గరకూడా చెప్పలేని మనస్సు బాధ శారదమ్మ దగ్గర చెప్పుకునేది బంగారమ్మ.

'ఏమె బంగారమ్మ! అలా వున్నావు' అని ప్రశ్నించేది అప్పుడప్పుడు కూరలతట్ట ముందుంచుకొని తల వంచుకు కూర్చున్న బంగారమ్మవైపు చూస్తూ శారదమ్మ.

'మా గంగులు మావని సూడాలని ఉందమ్మగోరూ !' అనేది రుద్ధస్వరంతో బంగారమ్మ.

'వాడెంత కఠినుడే నీలాటి భార్యను వదలిపోయేడు. ఎంత దురదృష్టవంతుడే' అని జాలిపడేది శారదమ్మ.

కొడుకుని విశాఖపట్నం వెళ్ళొద్దని చెప్పమని శారదమ్మను బ్రతిమిలాడింది బంగారమ్మ. మీలాటోళ్ళు చెబితే వినుకుంటాడేమో అని ప్రాధేయపడింది. చంద్రిగాడికి 'మీ అమ్మ ముఖం చూసి నువ్వు విశాఖపట్నం వెళ్ళడం మానేయ్' అని ఎన్నో రకాల హితవు చెప్పింది శారదమ్మ. చదువుకునే పిల్లలు రాజకీయాలజోలికి వెళ్ళకూడదంది. అన్నీ విని చిన్నగా నవ్వి మౌనంగా ఉండిపోయాడు చంద్రిగాడు.

మర్నాడు ఉదయమే ఉత్తచేతుల్తో వచ్చి నా కొడుకెళ్ళిపోయాడమ్మా అని బావురుమని ఏడ్చింది బంగారమ్మ వీధిగుమ్మంలో చతికిలబడుతూ.

ఫర్వాలేదు తిరిగివస్తాడు ఏడవకు అని ఓదార్చబోయిన శారదమ్మ మాటకు అడ్డువస్తూ, ఒస్తే స్వర్గానికెళ్ళి తిరిగొచ్చినట్టె. ఇసాకపట్నంలో మిలట్రీ దించేసినారంట. ఆ మిలట్రీ ఓళ్ళు చదూవుకునీ కుఱ్ఱోళ్ళని కాల్చేసి సముద్రంలో ఇసిరేస్తున్నారంట. ఎల్దావంటె బస్సులు నడనేదు. నడిసి ఎల్లిపోతానంటె మావోళ్ళు ఎల్లనివ్వటంలేదు. అవాళ కొడుకు పోయిన వార్త విన్నట్లే ఏడుస్తూంది బంగారమ్మ.

ఆమెకు అనునయించి ధైర్యం చెప్పేసరికి తలప్రాణం తోకకి వచ్చింది శారదమ్మకి. కాని శారదమ్మకూ నమ్మకం లేదు. విశాఖపట్నంలో రేగిన అరాచకం గురించి ఎన్నెన్నో గాలివార్తలు వస్తున్నాయి రేడియోలో చెప్పేవాటికి ఈ వార్తలకీ అసలు పొత్తేలేదు. ఏమిటో సమ్మె చేస్తున్నవారికి చెయ్యనివారికి ఎవరికీ మనస్సు స్థిమితంగా ఉండటంలేదు.

ఆ సంవత్సరం సంక్రాంతిపండుగ ఏ తెలుగువాడూ సంతోషంగా జరుపుకోలేదు. ఎన్నో పడీ విడని మొగ్గలు రాలిపోతున్నాయ్.

*   *   *

ఇరవై సంవత్సరాల తర్వాత మళ్ళీ తమ జిల్లాలో అడుగుపెట్టాడు గంగులు. తన ఊరివారెవరన్నా కనుపిస్తారేమో అని అతని చూపులు వెతక్కపోలేదు.

ఓనాడు కురుపాండవ యోధుల్లా ఎదురెదురు బారులు తీర్చినిల్చున్నారు విద్యార్థులూ, పోలీసులూ. ఆనాటి పోరాటంలో ఎవరెంత మించిపోయారో చెప్పడం కష్టం గంగులు వీరావేశంలో తనపై సోడావిసిరిన అబ్బాయిని లాఠీతో బాదాడు. లాఠీ దెబ్బలు ఆ కుర్రాడు తప్పించుకోలేకపోయాడు. రోడ్డుమీద పడి గిలగిలా తన్నుకున్నాడు. తర్వాత లారీ ఎక్కించుకుపోయింది. గంగులు కళ్లు మసకలు కమ్మాయి రోడ్డుమీద ఎఱ్ఱని రక్తంచూసి. ఆ కన్నుల్లో నీరు తిరిగింది. కర్తవ్య నిర్వహణలో తాను చేసిన కిరాతకచర్యపట్ల ఏవగింపు కలిగింది.

ఛీ మనసులేని ఎదవ ఉద్యోగం, ఎదవబతుకు అని తనను తాను తిట్టుకున్నాడు. ఎఱ్ఱగా పొడుగ్గా అందంగా బలే సురుగ్గా ఉన్నాడు కుఱ్ఱోడు ఈసరికి సచ్చేఉంటాడు.

ఈ సమ్మె సెయ్యకుండుంటె నాను కొట్టకుండుంటె ఆకుట్టోడు ఎంత పెద్దోడయ్యేవోడో, ఏం ఉద్యోగం సేసేవోడో. ఛీ. నా మనుసేటి ఇలా సెదిరిపోతంది. ఈ సమ్మెలో ఇలాటి మెలికల్లాటి కుట్టోళ్ళు ఎందరు సావనేదు! బూదేవత ఇంకా ఎంతమంది రగతం తాగాలనుకుంటుందో! నానీ ఎదవ ఉద్యోగంలో ఎందుకు సేరానూ. రత్నంలాటి బిడ్డనూ రాణీలాంటి భార్యనూ ఎందుకు ఒగ్గేసినానూ! నేనీ ఉద్యోగంలో సేరింది నా జిల్లావోళ్ళని మా తెలుగోళ్ళని సంపడానికా! అతనిలో మరుగుపడిన మానవత్వం పెల్లుబికి హృదయం కరిగి కన్నీరు కార్చాడు గంగులు. కాని కొన్నిక్షణాలే. మళ్ళీ ఉద్యోగ నిర్వాహణలో లీనమయ్యాడు.

పిల్లా పెద్దా ఆడామగా అందరినోటా సమ్మె భోగట్టాలె. అందరిలో ఏదో ఆవేశం, అసహనం. అగ్రహారంలోని ప్రజలూ ఆవేశపడిపోతున్నారు చర్చించుకుంటున్నారు. ఏదో చెయ్యాలంటున్నారు. కొందరు ప్రజలది తప్పనీ కొందరు ప్రభుత్వానిది తప్పనీ; మరికొందరు ఈ సమ్మె రేపెట్టినవాణ్ణి ఉరి తియ్యాలని రకరకాలుగా అంటున్నారు.

ఎంతో అరాచకం జరిగాక సమ్మె సద్దుమణిగింది. కాని చంద్రిగాడు తిరిగి అగ్రహారం చేరుకోలేదు. చంద్రిగాడు సమ్మెలో చచ్చిపోయాడు. బంగారమ్మ చెవిన పడకుండా అంతా గుసగుసలాడేరు.

బస్సులు నడవటం ప్రారంభించగానె పట్నం వెళ్ళింది బంగారమ్మ. కాని తిరుగుబస్సులో వచ్చేసింది. ఎవర్నడుగు

తుంది? తన కొడుకు వివరాలు. అసలామె పుట్టినదిమొదలు విశాఖపట్నం ఎప్పుడూ చూడనేలేదు. ఒకరిద్దరు పెద్దల్ని బ్రతిమిలాడింది చార్జీలిస్తాను, వెళ్ళి మా చంద్రిగాణ్ణి తీసుకు రండని.

ఒకటి రెండు రోజులు ఈమె ఇలా వేధించగా అన్నాడో పెద్దమనిషి. గంగుల్ని ఎలా మరచిపోయి బతికావో అలానె చంద్రిగాణ్ణి మరిచిపోయే, అని. అర్థమయిపోయింది బంగారమ్మకి. తలా గుండెలూ బాదుక ఏడ్చింది బంగారమ్మ.

బంగారమ్మ ఏడ్చి ఏడ్చి ఒక నిర్ణయానికొచ్చింది. మునసబు ఖచ్చితమైన మనిషి. అతని వ్యక్తిత్వంపైన నమ్మకం వుంది ఆమెకు. అతనివద్దకు వెళ్ళి తన ఆస్థిపాస్తులన్నీ అమ్మి తన కొడుకుపేరు నిలిచిపోయేలా ఒక స్కూలు బిల్డింగు కట్టమని కోరింది.

ఆమెవైపు చూసి అలాగె చేస్తాలె, అన్నాడు జాలిగా మునసబు కాని మర్నాటి ఉదయానికల్లా పెద్ద చెరువులో ప్రాణాలు వదుల్తుందని అనుకోలేదు.

సెలవిప్పించండి శారదమ్మగోరూ మా సెంద్రిగాడు లేని లోకంలో నేను బతకనేను. మా గంగులు మావోత్తె సెప్పండి ఆడికి నా దణ్ణాలని. ఆణ్ణి మరిసి నాను బతకనేదని సెప్పండి. ఆడి కొడుకులో ఆణ్ణి సూసుకుంటు బతికానని సెప్పండి. మీా మిల్ట్రీోడి సేతిలోనే నీ కొడుకు పేనాలు పోయాయని సెప్పండి అని బంగారమ్మ వణికే స్వరంతో చెప్పి చీకట్లో నడిచి గబగబా వెళ్ళిపోయింది. పాపం దుఃఖం

భరించలేకపోతోంది అని జాలిపడిందేకాని, బంగారమ్మ పోయిందనే వార్త ఉదయం వింటాననుకోలేదు శారదమ్మ.

ఆమె మరణానికి, అందరూ కంట తడిపెట్టుకున్నారు.

బంగారమ్మ పోయి ఆరునెలలు దాటింది. స్కూలు బిల్డింగ్ వరండాలో గోడకి చంద్రిగాడి ఫొటో తగిలించబడింది.

మిలట్రి దుస్తుల్లో టకటకా బూటుశబ్దం చేస్తూ, ఆ ఊరి పొలిమేర మామిడితోట కివతల కొత్తగా కట్టిన స్కూలు బిల్డింగ్ దగ్గర ఆగాడు గంగులు.

పిల్లాపెద్దా అతనివైపు చిత్రంగా చూస్తున్నారు.

పెళ్ళున నవ్వి, నాను నాను గంగుల్నిరా గుర్తుపట్టలేదా! అని అడిగాడు వయస్సుమళ్ళిన మునసబు బుజం మీద చెయ్యివేస్తూ గంగులు.

తృళ్ళిపడ్డట్టయి, గంగుల్ని కళ్ళద్దాలలోంచి కిందినుంచి మీదివరకూ పరిశీలనగాచూసి, ఓరి ఎంత పనిచేశావురా! అన్నాడు మునసబు.

'నాను నానేం చేశాను!' అని క్షణంతర్వాత 'బంగారం బాగుందా! నా కొడుకు నా కొడుకు బాగున్నాడా?' అడిగాడు గంగులు. ఆ గొంతు ధ్వనించిన తీరులో ఆత్రతా బిడియం కూడా ఉన్నాయి.

సరే తర్వాత మాట్లాడుకుందాం. ఇవాళ ఈ స్కూలు బిల్డింగ్ ఓపెనింగ్ ఉంది. అదిగో ప్రెసిడెంటుగారు వచ్చారు. అని అటువైపు నడిచాడు మునసబు.

రిబ్బను కత్తిరింపు, అల్పాహారవిందూ అయినతర్వాత, బంగారమ్మ పవిత్రమయిన జీవితం, ఆమె ఆదర్శం, త్యాగం వివరించి, ఆమెకూ ఆమె కొడుకు రామచంద్రరావుకి ఆ పరమేశ్వరుడు ఆత్మశాంతిని ప్రసాదించుగాక అని ఉపన్యాసం ముగించాడు మునసబు.

అప్రతిభుడయిపోయాడు గంగులు. వరండాలో గోడకి వేలాడుతూన్న ఫొటోవైపు పరిశీలనగా చూశాడు. విశాఖపట్నంలో అవ్వాళ్టి అబ్బాయి గుర్తువచ్చాడు. ఒకటికి పదిసార్లు ఫొటోవైపు చూశాడు. నా కొడుకు సమ్మెలో సమిధగా రాలిపోయాడా! గొణిగాడు.

స్థంభంచాటుకి వెళ్ళిపోయి దోసిట్లో మొహం దాచుకున్నాడు. అతని మనస్సు వికలమైపోయింది. మరెవరికి ముఖం చూపించకుండా వెనుకకు మళ్ళిపోయాడు. చాలా దూరం నడిచాడు. రైలింజనుకూత విని దూరాన్న వస్తూన్న పొగబండిని చూశాడు. పట్టాలమీద పడుకున్నాడు మరికొన్ని క్షణాల్లో పట్టాలమీదించి పరుగులు తీసింది రైలు.